ప్రజాశక్తి
శనివారం 10 డిసెంబర్ 2022
5
పార్వతీపురం మన్యం



ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి-కొమరాడ

జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు చొప్పున ఇవ్వాలని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గంగరేగువలస పంచాయతీ జంఝావతి సెంటర్లో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను గిరిజన సంఘం నాయకులు హెచ్.లక్ష్మణ్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షలతో ఇల్లు కట్టుకునే పరిస్థితి లేదన్నారు. ఇల్లు నిర్మించకుంటే పట్టాలు రద్దు చేస్తామని లబ్ధిదారులను బెదిరించడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధులు ప్రస్తుత ధరలతో పోలిస్తే ఎటూ సరిపోవని చెప్పారు. ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లేకుంటే రూ.5 లక్షలు బిల్లు చెల్లించాలని డిమాండ్ చేశారు.



వీరఘట్టం.. పొలంలో వరికుప్పలు వేస్తున్న రైతులు



వరిచేను రోడ్డుపైకి చేర్చి టార్పాలిన్ కప్పిన రైతులు

అకాల వర్షం.. అన్నదాత కలవరం

వరి కుప్పలు వేసేందుకు ఉరుకులు పరుగులు

గతంతో పోలిస్తే కాస్త దిగుబడి పెరిగిందన్న అన్నదాత ఆనందంపై అకాల వర్షం నీళ్లు చల్లింది. తుపాను కారణంగా గత మూడు రోజులుగా వర్ష సూచన కనిపించడంతో అన్నదాతకు కంటి నిండా కునుకు లేకుండా పోయింది. మాండస్ తుపాను శుక్రవారం రాత్రి తీరం దాటుతున్న నేపథ్యంలో సాయంత్రం నుంచి జిల్లా అంతటా స్వల్ప వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో అన్నదాత తీవ్రంగా కలత చెందుతున్నాడు. పొలాల్లో ఉన్న వరిచేలను కుప్పలుగా పెట్టేందుకు ఉరుకులు, పరుగులు తీశారు. అయినా జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులకు చెందిన వరిచేలు ఇంకా పొలాల్లోనే ఉండిపోవడంతో తడిచిపోయాయి. దీంతో వరి చేలు మొలకలు నాటుతాయని రైతులంతా ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది



జియ్యమ్మవలస.. ఆరబోసిన ధాన్యం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో వరి రైతులకు ఇది చేతికందే సమయం. విజయనగరం ఉమ్మడి జిల్లాలో సుమారు 4లక్షల ఎకరాలకు పైగా వరి సాగైంది. ఎకరాకు 21క్వింటాలు బస్తాల దిగుబడి వస్తోంది. ఇది గత ఏడాదితో పోలిస్తే 3క్వింటాళ్లు బస్తాలు అధికమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. 15రోజుల క్రితమే వరి కోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 60 శాతం కోతలు పూర్తయ్యాయి. వర్ష సూచన వల్ల చాలా మంది కోతలు వాయిదా వేసుకున్నారు. ఇప్పటికే కోసిన చేను పొలంగట్లపై దిబ్బలు పెట్టుకుంటున్నారు. ఈలోపు శుక్రవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతో రైతులు విస్మయానికి గురయ్యారు. పార్వతీపురం మన్యంజిల్లా పాలకొండ, సీతంపేట, భామిని, సీతానగరం, విజయనగరం జిల్లాలోని విజయనగరం, గజపతినగరం, గరివిడి, చీపురుపల్లి, మెంటాడ, వేపాడ, వంగర, భోగాపురం, డెంకాడ, జామి, నెల్లిమర్ల, బొబ్బిలి తదితర అన్ని ప్రాంతాల్లోనూ స్వల్ప వర్షం కురిసింది.

వర్షాభావ పోయేవరకు గుండె నిబ్బరంగా ఉండలేమని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షంలో తడిసిన వరి చేలకు ఎకరాకు పది ట్యాంకులు, ప్రతి ట్యాంకుకు 500గ్రాముల చొప్పున (5శాతం) ఉప్పు ద్రావణాన్ని కంకిపై పిచికారీ చేస్తే మొలకరాకుండా కాపాడుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇంకా వీలైతే టార్పాన్లు కప్పడం కూడా ఎంతో మేలని సూచించారు.



నెల్లిమర్ల.. సతివాడలో వరిచేను కుప్పలు పెడుతున్న రైతులు

అపోహలొద్దు.. మన మంచికే

- భూముల రీసర్వేపై డిప్యూటీ సిఎం రాజన్నదొర
- భూహక్కుదారులకు పట్టాలు పంపిణీ



భూహక్కుదారులకు పట్టాలను అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-కలెక్టరేట్

భూముల రీసర్వే పట్ల అపోహలు వద్దని, అంతా రైతుల మంచికోసమేనని డిప్యూటీ సిఎం రాజన్నదొర అభిప్రాయపడ్డారు. రీసర్వేతో శాశ్వత భూ హక్కు, భూ రక్ష కలుగుతుందని భరోసానిచ్చారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష - మీ భూమి మా హామీ కార్యక్రమం కింద రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో భూ హక్కుదారులకు పట్టాల పంపిణీని పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్ర వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా భూ రికార్డులు ఉండాలన్నది ముఖ్యమంత్రి జగన్ తపన అన్నారు. మన భూమి మనకు దక్కాలనేది ముఖ్యమంత్రి ఉద్దేశమని చెప్పారు. భూయజమాని భూమిపై హక్కు కలిగి ఉండాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులుంటే సరిచేయవచ్చని, రైతులు తప్పులుంటే గుర్తించాలని సూచించారు. రీసర్వే వల్ల మంచి రికార్డులు రూపకల్పన చేయొచ్చన్నారు.

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా చరిత్రలో ఈ రోజు చాలామంచి రోజన్నారు. అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమించి రీసర్వే చేస్తున్నారని ప్రశంసించారు. 20,400 భూ హక్కు పత్రాలను ఇప్పటి వరకు ముద్రణ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 7.76 లక్షల సర్వే నంబర్లు ఉన్నాయని, 6 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉందని వెల్లడించారు. న్యాయపరమైన అంశాలు ఉన్నచోట్ల మరింత పకడ్బందీగా, వివాదాలకు తావు లేని విధంగా చేపట్టాలని ఆయన కోరారు.

జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 102 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, 99 శాతం మందికి తప్పులు లేని భూ రికార్డులు తయారు చేశామన్నారు. ఏ మాత్రం తప్పులు ఉన్నా సరిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. మొదటి విడతలోని 83 గ్రామాలకు 10 వేల పట్టాలు వచ్చాయని పేర్కొన్నారు. జిల్లాలో 865 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, అందులో 200 గ్రామాల్లో రెండో విడతలో రీ సర్వే చేస్తున్నామని వివరించారు. కనీసం ఐదు సార్లు గ్రామ సభలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్వేశాఖ ఏర్పాటు చేసిన సర్వే సంబంధించిన ఎగ్జిబిషన్ స్టాల్‌ను రాజన్నదొర, అధికారులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.హేమలత, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజకుమార్, మండలాల తహశీల్దార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెను పరిశీలించిన పిఒ

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మండలంలోని తంపటాపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ఐటిడిఎ పిఒ బి.నవ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా పిఒ మాట్లాడుతూ ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ధాన్యం నాణ్యతను పరిశీలించి వీలైనంత ఎక్కువ ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌బికెలో ఉన్న రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం

ప్రజాశక్తి-సాలూరు

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ అన్నారు. సాలూరు మండలం శివరాంపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పిఒ శుక్రవారం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుల వరకు రైతు రవాణా చేస్తే ఆ ఛార్జీలను ప్రభుత్వం చెల్లిస్తుందని ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు, తూకం, లోడింగ్, ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏ ఒక్క రైతు మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం అమ్మరాదని ఆయన పేర్కొన్నారు. మద్ధతు ధర కంటే తక్కువకు ఎవరూ కొనుగోలు చేయకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతుల ధాన్యం కొనుగోలు నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రవాణా ఛార్జీలను మద్దతుధరతోపాటు రైతు ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి రైతులకు కొనుగోలు ప్రక్రియపై అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు పరిశీలన

పార్వతీపురంరూరల్ : మండలంలోని నర్సిపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎంపిడిఒ అకిబ్ జావేద్ పరిశీలించారు. తేమ పరీక్ష యంత్రాలు, గన్ని సంచులు పంపిణీ వివరాలు సిబ్బందిని అడిగి, రికార్డులు తనిఖీ చేశారు. కొంతమంది సిబ్బంది గైర్హాజరు కావడంతో, వారికి ఫోన్ చేసి వివరణ అడిగారు. మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు జాగ్రత్త పడాలన్నారు.

అమ్మో.. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం!

- కమీషన్ ఇస్తేనే ఫైలు కదలిక
- స్థలం ఏదైనా రిజిస్ట్రేషన్‌కు బాదుడే
- కార్యాలయం చుట్టూ డాక్యుమెంటు రైటర్లే



నెల్లిమర్ల మండల కేంద్రంగా నడుస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలంటే సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. చిన్నా చితకా రిజిస్ట్రేషన్లకు కూడా వేలల్లో వసూలు చేయడమే దీనికి కారణం. ప్రభుత్వం పెంచిన డాక్యుమెంటేషన్ ఫీజు సరేసరి. దానికి సమానంగా సబ్ రిజిస్ట్రార్‌కు కూడా కమీషన్ ఇవ్వాలని వసూలు చేయడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ లావాదేవీలన్నీ చూసేందుకు సబ్ రిజిస్ట్రార్ తన సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు డాక్యుమెంటు రైటర్లను ఏర్పాటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరు ముగ్గురూ తమ వద్దకు వచ్చిన కొనుగోలు, అమ్మకం దారుల నుంచి వేలల్లో వసూలు చేసి అందులో 80 శాతం నగదను సబ్ రిజిస్ట్రార్‌కు ఇస్తున్నట్లు సమాచారం.

ప్రజాశక్తి- గుర్ల, నెల్లిమర్ల

నెల్లిమర్ల, గుర్ల మండలాలకు కలిపి నెల్లిమర్లలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గతంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ నెలకు అన్ని రిజిస్ట్రేషన్లు కలుపుకుని సుమారు 500 నుంచి 600 వరకూ జరుగుతాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ. కోటి వరకూ ఆదాయం వస్తుంది. ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంతో పోటీ పడి సబ్ రిజిస్ట్రార్ కూడా వసూలు చేస్తున్నట్లు తెలిస్తోంది.

సబ్ రిజిస్ట్రార్ అంటేనే భయం

వాస్తవానికి నెల్లిమర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గతంలో మంచి పేరుండేది. గతేడాది నుంచి అక్కడ బాధ్యతలు తీసుకున్న సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారిని పీడించడంతో ఆ పేరు కాస్త నాశనమై అక్కడ రిజిస్ట్రేషన్లు అంటేనే భయపడుతున్నారు. దీంతో చాలా మంది ఈ రెండు మండలాల్లో క్రయ విక్రయాలకే భయపడుతున్నట్లు చెబుతున్నారు. మరి కొంత మంది భూములు కొనుగోలు చేసినా సబ్ రిజిస్ట్రార్ మారిపోయిన తరువాత రిజిస్ట్రేషన్ చేసుకుందాంలే అని వాయిదాలూ వేసుకుంటున్నట్లు తెలిస్తోంది. సబ్ రిజిస్ట్రార్ తన సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు రైటర్లను తన చుట్టూ పెట్టుకుని భారీగా వసూలు చేస్తున్నట్లు తెలిస్తోంది. ముగ్గురులో ఒక వ్యక్తి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఆనుకుని ఒక ఇంట్లో వ్యవహారం నడిపించగా మిగిలిన ఇద్దరు నెల్లిమర్ల- పాలకొండ రహదారిని ఆనుకుని ఎదురెదురుగా కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారు కచ్చితంగా ఈ ముగ్గురులో ఎవరో ఒకరి వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు తీసుకోవాల్సిందే. దీన్నే అదునుగా తీసుకుని వేల రూపాయలు వసూలు చేస్తున్నారు.

ఉదాహరణకు ఇటీవల గుర్ల మండలం గూడేం వద్ద 200 గజాల స్థలాన్ని నెల్లిమర్లకు చెందిన ఒక వ్యక్తి కొనుగోలు చేశాడు. దీనికి గాను రిజిస్ట్రేషన్ నిమిత్తం ప్రభుత్వానికి అతను సుమారు రూ.10,424 చెల్లించాడు. ఇవి కాకుండా రిజిస్ట్రేషన్ ఖర్చులు పేరిట ముగ్గురిలో ఒక డాక్యుమెంటు రైటర్ కొనుగోలు దారుడి నుంచి మరో రూ. 6500 వసూలు చేశాడు. ఇందులో సుమారు రూ.3,500 రిజిస్ట్రార్‌కే ఇవ్వాలని అతనే చెప్పడం కొసమెరుపు.

ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ. 3వేలకు పైగానే రాబడి?

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏ చిన్న రిజిస్ట్రేషన్ జరిగినా సబ్ రిజిస్ట్రార్‌కు కనీసం రూ.3వేలు ఇవ్వాల్సిందే. ఇలా రోజుకు ఈ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సుమారు 20 నుంచి 25 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. నవంబరు 1 నుంచి డిసెంబరు 1 వరకూ ఇక్కడ 544 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇందులో 135 రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ. 1.47కోట్లు ఆదాయం వచ్చింది. ఇది కాకుండా సబ్ రిజిస్ట్రార్‌కు డాక్యుమెంటు ఖర్చుల పేరిట వసూలు చేసింది లక్షల్లోనే ఉంటుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేల డాక్యుమెంటు ఖర్చులు ఇవ్వకపోతే అటువంటి రిజిస్ట్రేషన్లకు ఏదో ఒక వంక పెట్టి పెండింగ్‌లో పెట్టేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు బహిరంగంగానే బాధితులు చెబుతున్నారు.



శత్రుచర్లను పరామర్శిస్తున్న బుద్దా వెంకన్న

ఉత్తరాంధ్రలో విజె టాక్స్

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బుద్ధా వెంకన్న

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో జె టాక్స్ నడిస్తే, ఉత్తరాంధ్రలో విజె టాక్స్ నడుస్తోందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బుద్దా వెంకన్న వ్యాఖ్యానించారు. శుక్రవారం చినమేరంగిలో మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. త్వరలో కురుపాం నియోజకవర్గంలో భేదాభిప్రాయాలు పరిష్కారం అవుతాయని, పార్టీ నాయకులందరినీ ఏకతాటిపైకి తీసుకు వస్తామని చెప్పారు. ఉత్తరాంధ్రలో 34 స్థానాల్లో టిడిపి విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తంచేశారు. లిక్కర్ స్కామ్‌లో ఎక్కడ దొరుకుతామనే విజయసాయిరెడ్డి సెల్‌ఫోను పోయిందని నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. కక్ష పూరిత వాతావరణంలో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, అందుకే ప్రజలంతా అసహ్యించుకుంటున్నారని చెప్పారు. ఆంధ్రా.. బీహార్ కంటే వెనకబడే విధంగా ఈ ప్రభుత్వ పాలన ఉందన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది టిడిపి ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శేఖర్ పాత్రుడు, అక్కిన మధుసూదన్ రావు, పల్లా రాంబాబు, డొంకాడ రామకృష్ణ, కోలా రంజిత్, కొండయ్య, నందివాడ కృష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతులు, రైతు కూలీ సంఘం నాయకులు

ధాన్యం కొనాలని ధర్నా

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఎపి రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ముందుగా మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం కార్యదర్శి డి.వర్మ మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధర రూ.2040 ఉంటే, ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడంతో రైతులు దళారుల దోపిడీ గురవుతున్నారన్నారు. రూ.1600కు గత్యంతరం లేక ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తుందని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే రైతు వద్ద నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్.పెద్దవలస పంచాయతీ పరిధిలోని గండికొండ తదితర ప్రాంతాల్లో బంజర భూములు సాగుచేస్తున్న 90 గిరిజన కుటుంబాలకు సాగుపట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యాలు, అసిరి శ్రీనునాయుడు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ చట్ట సవరణతో

గిరిజనులకు చాలా నష్టం

గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలో సురేంద్ర



సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలో సురేంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్

అటవీ సంరక్షణ చట్ట సవరణతో గిరిజనులకు ఎంతో నష్టమని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలో సురేంద్ర అన్నారు. అటవీ సంరక్షణ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ పార్వతీపురం పట్టణంలోని సుందరయ్య భవనంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్ట సవరణ చేస్తే దేశంలోని సుమారు 10 కోట్ల మంది గిరిజనులు అడవులపై హక్కులను కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. అటవీ హక్కుల చట్టం నిర్వీర్యం అవుతుందన్నారు. చట్ట సవరణను ఆమోదించకుండా పార్లమెంట్లో రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బోయ, వాల్మీకులను రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌టిలుగా గుర్తిస్తూ జిఒ 52 విడుదల చేసిందని, తక్షణమే ఈ జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చితే పెద్దఎత్తున ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చడానికి ఈ పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం అధ్యక్షులు ఎస్.అప్పారావు, జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కోలక అవినాష్, జిల్లా గౌరవ అధ్యక్షులు రమణ, నాయకులు రామారావు, రామస్వామి, సుందర్రావు ,శంకర్రావు, తిరుపతిరావు, భాస్కరరావు, కృష్ణారావు, ప్రసాద్, బలరాం, తదితరులు పాల్గొన్నారు.



గృహ ప్రారంభోత్సవంలో పూజలు చేస్తున్న ప్రసన్నకుమార్

పేదలందరికీ ఇళ్లు

టిడ్కో ఛైర్మన్ ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-బలిజిపేట

పేదలందరికీ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అరసాడ గ్రామంలో ఎంపిటిసి గుల్ల ప్రభావతి పోలిరాజు గృహ ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సొంతిళ్లు లేని 32 లక్షల కుటుంబాలకు ఇళ్లను నిర్మించే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. నేడు అదేగృహాలలో లబ్దిదారులు ప్రవేశాలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పోల రామకృష్ణ, కెంగువ పాపినాయుడు, గుల్ల సింహాచలం, సుబ్బారావు, గుల్ల పకీర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ధాన్యం కొనుగోలు వేగవంతం

ప్రజాశక్తి-పాలకొండ

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ నూర్ ఉల్ కమర్ తెలిపారు. శుక్రవారం డివిజన్లోని అన్ని మండలాల తహశీల్దార్లు, వ్యవసాయ శాఖ, సివిల్ సప్లై, రెవెన్యూ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇబ్బందులకు గురికాకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. అనంతరం మండలాల వారీగా సేకరించిన ధాన్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాలకొండ అర్బన్ జగనన్న లేఅవుట్లో హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారులు గృహనిర్మాణాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు.

గిరిజన విద్యార్థి మృతిపై విచారణ

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని బడ్నాయకవలస ఆశ్రమ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న గెమ్మెల సందీప్ ఈ నెల ఐదవ తేదీ శనివారం అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఈ విషయమై శుక్రవారం పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ ఆశ్రమ పాఠశాలకు వచ్చి విద్యార్థి మృతిపై విచారణ చేపట్టారు. హెచ్ఎం సత్యారావు, హెచ్‌డబ్ల్యుఒ, పరమేష్‌తో మాట్లాడి పలు విషయాలు ఆరాతీశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ కళ్యాణి, పాచిపెంట, సాలూరు వైద్యాధికారులు పాల్గొన్నారు.



వైద్యులు, సిబ్బందితో సమావేశమైన డిఐఒ జగన్మోహనరావు

యుహెచ్‌సి పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని జగన్నాథపురంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు సందర్శించారు. గర్భిణులకు వైద్యాధికారి ఎస్.పద్మశ్రీ చేపట్టిన ఆరోగ్య తనిఖీలను పర్యవేక్షించారు. మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలించారు. ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని చెప్పారు. రక్తహీనతను నివారించే ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలని గర్భిణులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. అనంతరం క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది నిర్వహించిన డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. స్థానికులకు సీజనల్ వ్యాధులపై, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్ప, జయ గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే జైలుకే

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లక్ష్మీకుమారి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేస్తే జైలు శిక్ష తప్పదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బిహెచ్‌వి లక్ష్మీకుమారి తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం పై శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో జరిగిన న్యాయ అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. దేశంలో క్షీణిస్తున్న లింగ నిష్పత్తిని నిరోధించడానికి 1994లో పార్లమెంట్ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం చేసిందన్నారు. కార్యక్రమంలో స్త్రీ వైద్య నిపుణులు సాయి భార్గవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పద్య పఠన పోటీలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు అధ్యక్షతన శుక్రవారం పద్య పఠన పోటీలు నిర్వహించారు. ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పార్వతీపురం అధ్యక్షులు శివశేఖరరావు, కార్యదర్శి బాలకృష్ణ, బాలసాహితీవేత్త బి.వి.పట్నాయక్ పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కొమరాడ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎపిజిబి పార్వతీపురం బ్రాంచ్ మేనేజర్ కృష్ణసాగర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకులో ఖాతాలు తెరవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ఆఫీసర్ జగదీష్, సర్పంచ్ లక్ష్మణరావు, బ్యాంకు మిత్ర కామేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

పెద్దబోగిలిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-సీతానగరం

మేజర్ పంచాయతీ పెదబోగిలి పరిధిలో బుద్ధిపేట, దేవరవీధి, పెదబోగిలి గ్రామాల్లో సర్పంచ్ జి.తేజేశ్వర్ గరికయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. పూడికతీతలు, మురుగునీటి తొలగింపు కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఇఒ జి.వెంకట్రావు, పి.రామారావు పాల్గొన్నారు

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని సీతానగరం, పెద అంకలాం పిహెచ్‌సిల్లో వైద్యాధికారులు ఎం.రాధా క్రాంతి, శిరీష ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి ముందుగా ప్రభుత్వాసుపత్రిలో చేర్పేలా వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి వరలక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

సుందరీకరణకు అనుమతులివ్వాలి

బొబ్బిలి : స్టేట్ బ్యాంకు సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం పరిసర ప్రాంతాన్ని సుందరీకరణ చేసేందుకు అనుమతులు ఇవ్వాలని టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, కౌన్సిలర్లు కె.లక్ష్మి, వి.హైమవతి, మాజీ కౌన్సిలర్లు సుంకరి సాయిరమేష్, కాకల వెంకటరావు కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం పరిసర ప్రాంతాన్ని సుందరీకరణ చేసేందుకు టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబీనాయన సొంత నిధులను ఖర్చు చేస్తారన్నారు. అందుకోసం అనుమతులివ్వాలని కోరారు.

నాటుసారా నివారణకు ఆపరేషన్ పరివర్తన

బొబ్బిలి రూరల్ : మండలం పరిధిలోని గోపాలరాయుడుపేట పంచాయతీ కృపావలసలో నాటుసారా నివారణపై గ్రామస్తులకు 'ఆపరేషన్ పరివర్తన' పేరిట శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా సేవా ట్రస్టు తో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా తాగటం వలన కలిగే కష్ట, నష్టాలను వివరించారు. అనంతరం పేదలకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు, పండ్లను మదర్ థెరిస్సా సేవా ట్రస్ట్ సభ్యులు అందించారు.

నాడు-నేడు పనులు పరిశీలన

వేపాడ : మండలంలో బక్కు నాయుడుపేట కస్తూర్బా బాలికల వసతి గృహం, చినమురాడ, చిన్న గుడిపాల ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న నాడు నేడు పనులను ఎంఇఒ జి. శ్రీదేవి శుక్రవారం పరిశీలించారు. అనంతరం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి నాడు నేడు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కెజిబివిలో జరుగుతున్న పనులను పూర్తి చేయాలని తెలిపారు.

సమన్వయంతో పంచాయతీల అభివృద్ధి



సీతంపేట.. మాట్లాడుతున్న డిపిఒ సత్యనారాయణ

ప్రజాశక్తి-సీతంపేట

పంచాయతీల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక వైటిసిలో సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్పష్టమైన అవగాహనతో గ్రామ పంచాయతీ స్థాయిలో అవసరమైన అన్ని రకాలైన పనులను గుర్తించి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ప్రజలను, ప్రజాప్రతినిధులను, అధికారులను కలుపుకొని మంచి బడ్జెట్ తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, కార్యదర్శి బి.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

భామిని : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి తోట సింహాచలం ఆధ్వర్యంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పంచాయతీలో పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు సుందరంగా తీర్చిదిద్దాలని సర్పంచులకు ఎంపిపి సూచించారు. కార్యక్రమంలో శిక్షకులు ఎం.మహేంద్ర, ఎంపిడిఒ జి.కృష్ణారావు పాల్గొన్నారు.

కురుపాం : గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒ వి.వి.శివరామప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో రెండోరోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎంపిపి శెట్టి పద్మావతి మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే సర్పంచులు, ఎంపిటిసిలు , సచివాలయ సిబ్బంది అందరూ కలిసి సమగ్ర ప్రణాళిక తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ పి. బావాజీ, పిఆర్ జెఇ పి.నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి జి.సుజాత, వైస్ ఎంపిపి ఆరిక రంగారావు, అయ్యారకల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ చంద్రశేఖర రావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : నిధులు ఖర్చుపై అవగాహన అవసరమని ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ప్రణాళికల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి హాజరయ్యారు. అనంతరం ఎంపిడిఒ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వం అభివృద్ధి కోసం విడుదల చేస్తున్న నిధులను ఏ పనుల కోసం ఎంతవరకు ఖర్చు చేయాలనే అంశంపై వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ జామి నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.



కురుపాం.. మాట్లాడుతున్న ఎంపిపి శెట్టి పద్మావతి

వీరఘట్టం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిస్తున్న సర్పంచుల, ఎంపిటిసిల శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ రమణ, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మ్యూజియం పనులు పునఃప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ నవ్య

ఐటిడిఎ పిఒ బి.నవ్య

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో చేపడుతున్న మ్యూజియం పనులను పునఃప్రారంభించుటకు చర్యలు తీసుకొంటున్నట్లు ఐటిడిఎ పిఒ బి.నవ్య తెలిపారు. శుక్రవారం ఎపి టూరిజం రీజనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావుతో పిఒ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ మ్యూజియం పనులు పూర్తి చేయుటకు నిధులు సమకూరుస్తున్నామని చెప్పారు. నిధులు సమకూరిన వెంటనే పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయుటకు చర్యలు తీసుకొంటామన్నారు. ఎపి టూరిజం రీజనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎపి టూరిజం నుంచి కూడా నిధులు విడుదల అయ్యేలా చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం ఎఇ రాము, పార్క్ కేర్ టేకర్ సవర రాజు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం

ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ బి.నవ్య అన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం ప్రతీ గ్రామానికి వెళ్లి ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పిఎఒ హరికృష్ణ, ఎఒ తిలక్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్న దొర

చట్టం దృష్టిలో అందరూ సమానమే

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-పాచిపెంట

చట్టం దృష్టిలో అందరూ సమానులేనని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని పి.కోన వలస బాలుర కళాశాల ఆవరణలో శుక్రవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో రాజన్న దొర మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన ప్రాథమిక హక్కులకు ఆటంకం పరిస్తే న్యాయస్థానాల ద్వారా హక్కులు సాధించుకోవచ్చునని తెలిపారు. 2007 నుంచి ఇప్పటివరకు గిరిజనుల గిరిజన గ్రామాల్లో అనేక సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా కొత్త మెనూను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అప్పలనాయుడు, సిఐ ధనుంజయరావు, సర్పంచ్ కె.మంగ, టి.గౌరీశ్వరరావు, జాతీయ మానవ హక్కుల పాలక సంస్థ స్టేట్ రీజినల్ జనరల్ సెక్రటరీ పాండ్రంగి సంతోష్‌కుమార్, పాచిపెంట సాలూరు మండల అధ్యక్షులు కొర్లాపు వెంకట్రావు, కొండగొర్రి కృపారావు పాల్గొన్నారు.

వైసిపిది అరాచక పాలన

'ఇదేం కర్మ'లో సంధ్యారాణి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు జి.సంధ్యారాణి

అంతమొందించేందుకు ప్రజలు సహకరించాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి కోరారు. శుక్రవారం పట్టణంలోని 26 వార్డు కోనేరు గట్టు, వెంకటేశ్వర కాలనీల్లో ఇదేం కర్మ మనరాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు ఛార్జీలు భారీగా పెరిగాయని చెప్పారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. మూడేళ్లలో అధికారపార్టీ నాయకుల అరాచకాలు, భూకబ్జాలు పెరిగాయని చెప్పారు. మద్యనిషేధమని చెప్పి గ్రామగ్రామాన నాటుసారా విక్రయాలు పెంచిందని విమర్శించారు. ఇలాంటి ప్రభుత్వాన్ని సాగనంపకపోతే ప్రజలు మరింత కష్టాల్లో కూరుకుపోతారని సంధ్యారాణి చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మాజీ కౌన్సిలర్ అల్లు అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఇదేం కర్మ

సీతంపేట : మండలంలోని కడగండి, గజలి పంచాయతీలో కొత్తవలస, గదబవలస, కురిటికొండ, దేవగిరి, చాకలిగూడ, గజలి, ఈతమానుగూడ గ్రామాల్లో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయక్రిష్ణ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మౌలిక సౌకర్యాల కల్పనపై దృష్టిపెట్టడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ కార్యదర్శి నిమ్మక నాగేశ్వరావు, నిమ్మక చంద్రశేఖర్ ,పత్తిక అప్పన్న, కుండంగి మురళి, మాజీ సర్పంచ్ సవర బాపన్న, సవర బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభ పోస్టరావిష్కరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఎస్ఎఫ్ఐ అఖిల భారత 17వ మహాసభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ కోరింది. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో మహాసభ పోస్టర్‌ను జిల్లా కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ డిసెంబర్ 13, 14, 15, 16 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే జాతీయ మహాసభకు మన్యం జిల్లా నుండి డి.పండు, కె.రాజు ప్రతినిధులుగా వెళ్ళనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.సింహాచలం, కె.భాస్కర్, కె.రాజు పాల్గొన్నారు.

వరికోతలు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి-పాచిపెంట

తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు వీలైనంత వరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలని ఎఒ తిరుపతిరావు సూచించారు. ప్రమాదకరమైన వర్షసూచన లేనప్పటికీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ధాన్యం కొనుగోళ్ల మీద అవగాహన కల్పించాలన్నారు. రైతులెవరూ నష్టపోకుండా చూసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. వరి నూర్పులు పూర్తయిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో తెలియజేస్తే సాంకేతిక సహాయకులు వరి కళ్లాల వద్దకే వచ్చి నమూనాలను సేకరిస్తారని తెలిపారు. తేమ శాతం 17 మించకుండా ఉండాలన్నారు. బస్తాలు సొంతంగా సమకూర్చుకున్న రైతులకు బస్తాకు 3.39 రూపాయలు, దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలు రైతు ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ హైమ, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.



సీతానగరం.. సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ అవినాష్

సీతానగరం : మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని ఎఒ అవినాష్ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలుపై చర్చించారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, ఎంపిడిఒ కృష్ణమహేష్ రెడ్డి, ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసి మామిడి బాబ్జీ, పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాల్సిందే

ప్రజాశక్తి-కొమరాడ

ప్రభుత్వ పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం సమర్థవంతంగా నిర్వహించాలని డిఎల్‌డిఒ పి.చంద్రమ్మ ఆదేశించారు. శుక్రవారం కొమరాడ మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో పెట్టిన మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. భోజన సమయానికి ఆకస్మిక తనిఖీ చేసిన ఆమె పిల్లలకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పలు రికార్డుల పరిశీలించారు. ఎంత మంది పిల్లలకు ఎంత ఆహారం వండుతున్నారని ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించేందుకు జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. నిర్వాహకులు ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థులకు సక్రమంగా భోజనాన్ని అందించాలని సూచించారు. మెనూ సక్రమంగా అమలు చేయకపోతే నిర్వాహకులపై చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఎల్‌డిఒ చంద్రమ్మ

జనసేన మండల అధ్యక్షులుగా మల్లేష్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జనసేన గుమ్మలక్ష్మీపురం మండల అధ్యక్షులుగా ఇరిడి ఎంపిటిసి కడ్రక మల్లేశ్వరరావును నియమించారు. ఈ మేరకు శుక్రవారం జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ విజయనగరంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ పార్టీ కార్యక్రమాలను దిగ్విజయంగా చేపడతానని అన్నారు.



మల్లేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న నాదెండ్ల మనోహర్

డిగ్రీ కళాశాలలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సీతంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం దోనుభాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపూతలు సేకరించారు. వైద్యానికి సంబంధించి కొన్ని పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంపై సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జీవన జ్యోతి, వైద్యాధికారి లావణ్య, వైస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠాపురం పంచాయతీలో పెద్దగూడ నుండి నాయుడుగూడ వరకు రహదారి నిర్మాణ పనులను సర్పంచ్ ఎ.మన్మథరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామానికి సరైనటువంటి రహదారి లేక గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గిరిజనుల సమస్యలు తెలుసుకొని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ప్రత్యేక చొరవ తీసుకొని రహదారి మంజూరు చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఎన్.వెంకటరావు, వైస్ ఎంపిపి అన్నాజీరావు, ఎంపిటిసి రాజేశ్వరి పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎఎంసి చైర్మన్, సర్పంచ్

ఐటిడిఎ నిధులతో రహదారి నిర్మాణం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ఉదయపురం పంచాయతీ ఉదయపురం కాలనీ నుంచి దాసుగూడ వరకు ఐటిడిఎ ద్వారా మంజూరైన నిధులతో శుక్రవారం రహదారి పనులను సర్పంచ్ అరిక అరుణ, వైసిపి నాయకులు రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గిరిజన గ్రామానికి కిలోమీటర్ మేరకు పూర్తిగా రహదారి సదుపాయం లేనందున గిరిజనులు అనేక ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఆరు లక్షల నిధులతో మంజూరైన రహదారి పనులు చేయడం వల్ల ఆ గ్రామస్తులకు అత్యవసర సమయంలో రాకపోకలకు వాహనాలు వెళ్లడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు రాజు

రోడ్డు దాటుతుండగా ప్రమాదం

వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-కొమరాడ

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. కొమరాడ ఎస్ఐ జగదీష్ నాయుడు కథనం ప్రకారం.. మండలంలో శివుని గ్రామానికి చెందిన అధికారి సత్యంనాయుడు (75) మంచినీటి కావిడి పట్టుకొని రోడ్డు దాటుతుండగా రాయగడ నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీని, డ్రైవరును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.



మృతిచెందిన సత్యంనాయుడు